క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు మండల ఎస్సై శ్రీహరి తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, దాని వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని తెలియజేశారు. సాయంత్రం ఆయన గద్వాల–రాయచూరు వెళ్లే రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా దేని అనుకోని సంఘటనలు జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందని తెలిపారు.

చదువు, క్రీడల్లో అమ్మాయిలే ముందుండాలి



ఉండవెల్లి: ప్రాగటూరులో గ్రామైక సంఘం ఆధ్వర్యంలో కిషోర బాలికలకు క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు సింగరాజు మద్దిలేటి మాట్లాడుతూ అమ్మాయిలు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని సూచించారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో సీసీ వహీదా, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల అందజేత



ధరూరు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను ఎంఈఓ రవీంద్రబాబు అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, సీఆర్పీలు నర్సింహులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొండేరులో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఎర్రవల్లి: కొండేరులోని మండల విద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం 2025–26 విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అమీర్‌పాషా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన 12,511 నూతన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేసినట్లు తెలిపారు.

వేరుశనగ పంటల పరిశీలన



కేటీదొడ్డి: చింతలకుంట గ్రామంలోని వేరుశనగ పంటలను శుక్రవారం ఏఈఓ భరత్ సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా వేరుకుళ్ల ప్రభావం అధికంగా ఉండాడాన్ని గుర్తించి సంబంధిత రైతులకు నిపుణులు సూచనల మేరకు తదుపరి సీజన్‌లో తప్పని సరిగా పంట మార్పిడి పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. వరుసగా వేరుశనగా సాగు చేయకూడదని.. పంట మార్పిడి చేసి మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, కందులు, పెసరపంటలను విత్తుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి కోసం ట్రైకోడెర్మా, ప్యూడోమోనాస్ వంటి జీవ సారధ్యాలను వాడాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గద్వాల క్రైం: అకారణంగా కులం పేరుతో దూషించిన సంఘటనలో శుక్రవారం ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రాజు తన ఇంటి పక్కన ఉన్న హరిప్రసాద్ కుటుంబ సభ్యులు అకారణంగా కులం పేరుతో దూషించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో హరిప్రసాద్ కుటుంబ సభ్యులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూ వివాదంలో కేసు నమోదు

గద్వాల క్రైం: భూ వివాదం సంఘటనలో ఒకరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలం శివపురం గ్రామానికి చెందిన రాములు భూ తగాదాల విషయంలో తన అన్న కొడుకు సురేష్ తనపై దాడి చేయగా గాయాలయ్యాయి. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు



మానవపాడులో బడిబాట కార్యక్రమంలో పిల్లలతో ఉపాధ్యాయులు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- బడిబాట కార్యక్రమాలు
- గ్రామాల్లో ర్యాలీలు, ప్రజలకు అవగాహన సమావేశాలు

సాక్షి, నెట్‌వర్క్: గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని శుక్రవారం జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు.

● మల్దకల్ మండలంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అంగన్‌వాడీ టీచర్లకు, తల్లిదండ్రులు బడీడు పల్లలను బడిలో చేర్పించాలని సూచించారు.మల్దకల్, పెద్దొడ్డి పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, బజారన్న, మునెప్ప, లక్ష్మి పాల్గొన్నారు.

● గట్టు మండలంలో బడీడు పిల్లలకు బడికే పంపాలని ఎంఈఓ నల్లారెడ్డి కోరారు. బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సత్యకళ, ఎస్ఐ నర్సింహులుగౌడు, హెచ్‌ఎంలు శశికళ, లతారెడ్డి, కార్యదర్శి మునినాయక్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

● కేటీదొడ్డి మండలంలోని గంగన్‌పల్లి, కొండాపురం గ్రామంలోని ఈ నెల 6 నుంచి 19 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, నర్సింహులు, సీఆర్‌పీ యుగంధర్, పాపయ్య, శివరాజ్ ఉన్నారు.

● మానవపాడులో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ ఆధ్వర్యంలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, ఉపాధ్యాయులు వెంకటేష్, రుమానా పర్వీన్, ఇక్బాల్, రామేశ్వర్‌రెడ్డి, విజయమ్మ, శ్రీలేఖ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత పాల్గొన్నారు.

● ధరూరు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలందరిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు.



ధరూర్‌లో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి



మల్దకల్‌లో మాట్లాడుతున్న సురేష్



గంగన్‌పల్లిలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

అఖిలపక్ష పార్టీల నాయకులు అరెస్ట్



అయిజ పోలీస్‌స్టేషన్‌లో అఖిలపక్షం నాయకులు

అయిజ: ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ జరిగిన సంఘటనలో అరెస్ట్ చేసి జైలుకు పంపించిన రైతల కుంటుబసభ్యులను పరామర్శించేదుకు రాజోళి మండలం పెద్దధన్వాడ గ్రామానికి వెళ్తున్న అయిజ అఖిపక్ష కమిటీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఉదయం 7 మంది నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలి పెట్టారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యర్శి గోపాల్ యాదవ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ, బహుజన రాజ్యసమితి నాయకుడు వినోద్ కుమార్ ఉన్నారు.

రైతులపై దాడి సరికాదు

ఉండవెల్లి: పెద్దధన్వాడలో రైతులను పరామర్శించేందుకు వెళుతున్న అఖిలపక్షం నాయకులను అడ్డుకోవడం సరికాదని సీపీఎం నాయకుడు మద్దిలేటి అన్నారు. రైతులు తమ పొలాలను కాపాడుకునేందుకు పోరాటం చేస్తుంటే.. వారిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులందరికి న్యాయం చేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, మద్దిలేటి, నరసింహ, పాండు, శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా

గద్వాల టౌన్: విద్యుత్ శాఖలో అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఆ శాఖ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా అన్నారు. విద్యుత్ శాఖలో జేఏఓ సుదర్శన్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఉద్యోగులు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఆర్టీజిన్ ఉద్యోగుల గ్రేడ్ మార్పు కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు. విద్యుత్ ఉద్యోగుల ఈపీఎఫ్, జీపీఎఫ్ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 1104 యూనియన్ నిరంతరం పనిచేస్తుందని చెప్పారు. సుదర్శన్ అంకితభావంతో విధులు నిర్వహించారని, విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. అనంతరం సుదర్శన్‌ను యూనియన్ నాయకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి



ధర్నా చేస్తున్న అఖిలపక్ష పార్టీ నేతలు

గద్వాల: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యభారతంలో మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. కర్రగుట్టలోని ఖనిజసంపదను కార్పొరేట్ కంపెనీలైన అదాని, అంబానీలకు దోచిపెట్టేందకు కేంద్రం అమాయక ఆదివాసీలను చంపుతుందన్నారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరినప్పటికీ కేంద్రం మాత్రం అమానుషంగా వ్యవహరిస్తున్నట్లు మండిపడ్డారు. శాంతిచర్చలు జరపనిపక్షంలో ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, వెంకట్రాములు, వెంకటస్వామి, కుర్వ పల్లయ్య, గోపాల్, గోపాల్‌రావు, మస్తాన్, తిమ్మప్ప, మస్తాన్, చిన్న, రవి ప్రవీణ్, రంగన్న పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులుకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ సిబ్బందికి ప్రతి శుక్రవారం హెల్త్ చెకప్ నిర్వహించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్ విజయ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



తొట్టిలో నిల్వ వున్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారినుంచి రక్షించుకుందామని కమిషనర్ రాజయ్య పిలుపునిచ్చారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పారిశుద్ధ్యంపై మహిళలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వృథా నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు సురక్షితం



ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమమానస

మానవపాడు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమని డాక్టర్ హేమమానస అన్నారు. మానవపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ డే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలకు ప్రజారోగ్యం, గర్భిణీల ఆరోగ్యం గురించి డాక్టర్ అవగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్య చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హెలెన్, అబేదుల్ల, అక్కమ్మ, చంద్రన్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామికి రజత కవచధారణ



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామికి వెండితో తయారు చేసిన కవచాన్ని ఉడిపి పలిమారు మఠం పీఠాధిపతుల చేతుల మీదుగా ధరింపజేసినట్లు ఆలయ ధర్మకర్త గిరిరావు తెలిపారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు హాజరయ్యారు.

ఘన సన్మానం



అయిజ: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం సందర్భంగా అయిజ పట్టణానికి చెందిన శివకుమార్‌ను మే 25న విశ్వకర్మ రాష్ట్ర కమిటీ విశ్వకర్మ నాయకుడిని అవార్డుతో సత్కరించింది. శుక్రవారం వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు శివకుమార్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రవి ప్రకాష్ మాట్లాడారు. బీసీ ఉద్యమంలో పాల్గొనడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం, నాయకత్వ దక్షత కలిగి ఉండడంతో గుర్తింపుగా కమిటీ వారు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకులు

గట్టు: టైలరింగ్ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధితో పాటు మరొకరిపై ఆధారపడకుండా జీవించవచ్చని రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రత్నకుమారి తెలిపారు. శుక్రవారం బోయలగూడెంలో 45 రోజుల పాటుగా నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబానికి ఆసరాగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, రాజ్‌కుమార్ ఫౌండేషన్ సలహాదారుడు మధు, సూర్యప్రకాష్, ప్రవీణ్, టైలరింగ్ టీచర్ పరిపూర్ణ, రమాదేవి, జంగం వీరేష్, కంసలి రవి, ఆంజనేయులు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



గద్వాల: సీఎం రిలీఫ్‌ఫండు నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన పద్మావతికి మెరుగైన వైద్యం కోసం రూ.16,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్‌గౌడ, తిమ్మారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణకు సహకరించండి



అయిజ: రైతుల పంట పొలాల్లో మట్టిని సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయ అధికారులు మట్టిని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారని, రైతులు సహకరించాలని మండల వ్యవసాయాధికారి జనార్దన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల శివార్లలో పంటపొలాల్లో మట్టిని సేకరించే కార్యక్రమాన్ని ఏఈఓలు చేపట్టారు. సేకరించిన మట్టిని ల్యాబ్‌లో పరీక్షలు చేయించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసే కార్యక్రమం చేపట్టినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

జోగుళాంబ రైల్వే హాల్ట్ అద్భుతం



ఉండవెల్లి: దేశంలోనే రైల్వే నిర్మాణాలు శరవేగంగా జరుగుతుండగా జోగుళాంబ రైల్వే హాల్ట్ నిర్మాణం అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్ పనులను ఆయన, రాజగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం తక్కశిల గ్రామంలో మోదీ 11 ఏళ్ల పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాజశేఖర్ శర్మ, మండల అధ్యక్షులు పిడుగు వెంకటేష్, ఉపేందర్, రాజేశ్వర్‌రెడ్డి, చందు, రాఘవేంద్ర, సూరి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



అలంపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మంజుల



యల్లందొడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మధన్‌మోహన్‌గౌడ్

- ఆయా మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

అలంపూర్: రెవెన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ మంజుల అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురం, మండలంలోని బైరన్‌పల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో అధికారులు భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఇమాంపురంలో 4, బైరనపల్లిలో 1 దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, ఆర్ఐలు దుర్గా సింగ్, మాసుం బాష పాల్గొన్నారు.

గట్టు: తహసీల్దార్ మధన్‌మోహన్‌గౌడు ఆధ్వర్యంలో మండలంలోని యల్లందొడ్డిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 44 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గొర్లఖాన్‌దొడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 14 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 27 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మల్దకల్: మండలంలోని బిజ్వారం, నాగర్‌దొడ్డి గ్రామాలలో డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 60పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అయిజ: మండంలోని ఉత్తనూరులో రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న అన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.



రామాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న

అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు

సాక్షి, నెట్‌వర్క్: విక్షిత్ భారత్ అంటే అభివృద్ధి చెందిన భారత దేశం అని, భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే ప్రధాన నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు అన్నారు. శుక్రవారం అయిజ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ ముఖ్య కార్యర్తల సమావేశం నిర్వహించారు.

● మానవపాడు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కేకే రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన అన్ని దేశాలకు ఆదర్శమన్నారు.

● ఎర్రవల్లి మండల పరిధిలోని కోదండాపురంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఒబీసీ అధ్యక్షుడు దేవదాసు మాట్లాడారు.

● కేటీదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

● మల్దకల్‌లో బీజేపీ మండల నాయకుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

● గట్టులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మీర్జాపురం రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

● ఇటిక్యాలలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అక్కల రామ సాయిబాయి, మండలాధ్యక్షులు షేక్ అబ్దులా ఆధ్వర్యంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు.